క్లుప్తంగా

నేడు విద్యుత్ విజయోత్సవ సభ

భువనగిరిటౌన్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం విద్యుత్ విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు విద్యుత్ ఎస్ఈ శ్రీనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని సోమ రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు విద్యుత్ వినియోగదారులు, రైతులు హాజరుకావాలన్నారు.

రామన్నపేట : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నియోజకవర్గస్థాయి విద్యుత్ విజయోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు ఏడీఈ నవీన్‌కుమార్‌రెడ్డి, ఏఈ జే.నర్సింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, విద్యుత్‌శాఖ అధికారులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సభను జయప్రదం చేయాలి

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని పీఎస్ గార్డెన్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించనున్న విద్యుత్ విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ట్రాన్స్‌కో ఏఈ కె. ప్రభాకర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయోత్సవ సభకు ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, భువనగిరి డీఈ దంతూరి శ్రీశైల మల్లికార్జున్ గౌడ్ పాల్గొంటారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, వినియోగదారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చౌటుప్పల్ : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణ కేంద్రంలోని ఎస్ఎంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న విద్యుత్ విజయోత్సవ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

బీబీనగర్: మండలంలోని కొండమడుగు గ్రామంలోని కాంగ్రెస్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పంజాల ఆంజనేయులుగౌడ్, ఉపాధ్యక్షులుగా పెంటయ్య, రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అఫ్రోజ్, కార్యదర్శి జంగారెడ్డి, కోశాధికారిగా హనుమంతరావులను ఎన్నుకున్నారు.

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

భువనగిరిటౌన్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పారా లీగల్ వలంటీర్ కోడారి వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు జిల్లా కోర్టు నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ర్యాలీలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, సంఘ సేవాకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న సీఎన్ రెడ్డి

వలిగొండ : మండలంలోని జంగారెడ్డిపల్లికు చెందిన పలువురు యువకులు ఆదివారం బీజేపీ నాయకుడు సీఎన్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆవుల భిక్షం, బొంత భాస్కర్, ఆలకుంట్ల దయాకర్, జింకల మల్లయ్య, బొంత ఎల్లయ్య, వరికుప్పల వెంకన్న, ఆలకుంట్ల రాజు, శివరాత్రి నరసింహ, వరికుప్పల నరసింహ, జయరాజు, రాము, దాసు పాల్గొన్నారు.

ప్రజలు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి



రామన్నపేట : బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న దైద రవీందర్

రామన్నపేట : ప్రజలు భక్తిభావాన్ని కలిగి ఉండాలని టీ పీసీసీ నాయకుడు దైద రవీందర్ అన్నారు. ఆదివారం లక్ష్మాపురం గ్రామంలో జరుగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణకు రూ. 10వేల విరాళం అందజేశారు. ఆయనవెంట సర్పంచ్ ఉప్పు ప్రకాష్ ఉత్సవ నిర్వాహకులు నీల ఐలయ్య, బత్తుల వెంకటేశం, రేగులగడ్డ నరేష్, శ్రవన్‌కుమార్, బత్తుల నవీన్, గుండాల సతీష్ బత్తుల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి

సంస్థాన్ నారాయణపురం: ఒడిశా రాష్ట్రంలో జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి ఆదివారం స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సిలివేరు సైదులు, నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు ప్రభాకర్, మేకని వెంకటరమణ, సురేష్, దోసర్ల శివ, రాజు, అభినవ్, శివకుమార్, శివాజీ, రాజు, శేఖర్, నరేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరేనా?

- ప్రారంభం కాని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు
- స్థల సేకరణకే పరిమితమైన వైనం
- నిరుపేదలకు తప్పని ఎదురుచూపులు



మైలారం తండా సమీపంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం గుర్తించిన స్థలం



నాయకుని తండా సమీపంలో గుర్తించిన స్థలం

బొమ్మలరామారం : పేదోడి సొంతింటి కల.. కలగానే మిగులుతోంది. ఇల్లు లేని పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. మండలంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు నేటికీ మొదలు పెట్టలేదు. దీంతో డబుల్ బెడ్‌రూం ఇళ్లు వస్తాయని ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు నిరీక్షణ తప్పడం లేదు.

స్థల సేకరణకే పరిమితం..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఇల్లు లేని నిరుపేద ఉండకూడదని పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు కట్టిస్తానని హామీ ఇచ్చారు. అనుకున్నదే తడువుగా ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కానీ ఏళ్లు గడుస్తున్నా మండలంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇంటికి పునాదులు పడలేదు. మండలంలోని చీకటిమామిడిలో 20, మర్యాల 54, మైలారం తండాలో 15, నాయకుని తండాలో 20, వాలు తండాలో 10, తిమ్మాపూర్‌లో 24, రామలింగంపల్లిలో 20, లక్ష్మీతండాలో 24, కంచల్ తండాలో 20 మొత్తం 207 ఇళ్ల స్థలను నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. దీంతో ఆయా గ్రామాల్లో అధికారులు స్థలాల సేకరణ పూర్తి చేశారు. ఇళ్ల నిర్మాణ పనులకు టెండర్‌లు పిలిచిన కాంట్రాక్టర్‌లు ముందుకు రాకపోవడంతో డబుల్ ఇళ్ల నిర్మాణాలు నేటికీ ప్రారంభం కావడం లేదు. దీంతో ఇళ్లు లేని నిరుపేదలు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం ఆశతో ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

స్థల సేకరణ పూర్తి చేశాం



మండలంలో 207 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలకు స్థలాల సేకరణ పూర్తి చేశాం .ఇళ్ల నిర్మాణ ప్రక్రియలో భాగంగా పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్‌కు ఇళ్ల స్థలాలను అప్పగించాం. టెండర్‌లను కాల్ ఫర్ చేసిన కాంట్రాక్టర్‌లు ముందుకు రాకపోవడంతోనే ఇళ్ల నిర్మాణ ప్రక్రియ నిలిచిపోయింది.

– పద్మ సుందరి, తహసీల్దార్

నిర్మాణ పనులు మొదలు పెట్టాలి



మండలంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం మొదలు కాలేదు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై ఆశలు పెట్టుకున్న పేదలకు ఏళ్ల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదు. మండలంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు నిర్మాణాలు మొదలు పెట్టాలని కోరుతున్నాం.

– సుర్వీ వెంకటేష్ గౌడ్, మైలారం

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే



డ్రెయినేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని 13వ వార్డులో ఆయన పర్యటించారు. వార్డు పరిధిలో జరుగుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారాన్ని మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రూ.36కోట్లతో నిర్మాణం చేపట్టనున్న 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్‌లు ఎండీ. బాబాషరీఫ్, సుల్తాన్ రాజు, నాయకులు తొర్పునూరి నర్సింహ్మా, చెవగోని వెంకటేశ్, మహేష్, స్థానికులు నర్సింగ్ రావు, నర్సింహ్మా, శ్రీహరి, అశోక్, కిషన్, జంగయ్య, నాగరాజు, వేణు తదితరలు ఉన్నారు.

దేవాలయానికి రూ.3లక్షల విరాళం

మండల పరిధిలోని చిన్నకొండూర్ గ్రామంలో ఆదివారం జరిగిన ముత్యాలమ్మ దేవాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ అభివృద్ధికి రూ.3లక్షల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ జిల్లా సభ్యుడు ముప్పిడి శ్రీనివాస్, గ్రామస్తులు చెక్క శ్రీనివాస్, శివకుమార్, శ్రీకాంత్, సత్తిబాబు, భాగ్యమ్మ, నర్సింహ, రాములు, నరేష్, మల్లేష్, శివ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలి

సంస్థాన్ నారాయణపురం: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ జక్కడి జంగారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గుత్త ప్రేంచందర్ రెడ్డి, కత్తుల లక్ష్మయ్య, లారీ భిక్షం, పల్లె గోవర్ధన్ రెడ్డి, జక్కడి యాదిరెడ్డి, బొడ్డుపల్లి గాలయ్య, సోమనబోయిన చంద్రశేఖర్, పల్లె సీతారాంరెడ్డి, పాలకూర సతీష్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



తాళి బొట్టు చూపిస్తున్న వేదపండితుడు

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల శ్రీ అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వాహణ అధికారి మోహన బాబు,సర్పంచ్ కొత్త నర్సింహ, ఎంపీటీసీ సామ రాం రెడ్డి, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి కల్యాణం..

వలిగొండ : మండలంలోని ఆరూర్‌లో బద్దం రామకృష్ణారెడ్డి కాలనీలో మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిట్టెడి జనార్దన్ రెడ్డి, వాకిటి అనంత రెడ్డి, బిజెపి నాయకులు సి ఎన్ రెడ్డి, పిసాటి అంజిరెడ్డి,యాదవసంగం సభ్యులు బుర్ర నర్సింహా,మర్రి నాగరాజు, నర్సింహా, బోళ్ల అంజయ్య, జినుకల సాలయ్య పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లి ఆలయంలో గణపతి హోమం



గణపతి హోమం నిర్వహిస్తున్న భక్తులు

భువనగిరిటౌన్ : పట్టణంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శృంగేరి ఉబయ జగద్గురువుల శిష్యులతో గణపతి హోమం నిర్వహించారు. సోమవారం శాంతి హోమం, ఉదయం 11గంటలకు అమ్మారి మహాదర్శనం, 6న ఉదయం 11 గంటలకు బోనాలు సమర్పణ కార్యక్రమం ఉంటుందని దేవాలయం కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్లు మాయ దశరథ, ప్రమోద్‌కుమార్, నాయకులు కాలేరు లక్ష్మణ్, కాలేరు వినోద్, శ్రీనివాస్, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పండుగలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు

బొమ్మలరామారం : పండుగలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి అన్నారు. మండలంలోని హాజీపూర్ గ్రామంలో ఆదివారం జరిగిన బొడ్రాయి పండుగలో ఆయన హాజరై పూజలు నిర్వహించారు. అదే విధంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుమల కవితా వెంకటేష్ గౌడ్, ఎంపీటీసీ పక్కీరు రాజేందర్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామిడి రాంరెడ్డి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

తుర్కపల్లి: మండలంలోని దత్తాయపల్లి గ్రామంలో ఎస్డీఎఫ్ ద్వారా మంజూరైన రూ.25 లక్షల సీసీ రోడ్డు పనులకు ఆదివారం సర్పంచ్ వెన్నకూచి రాం మోహన్‌శర్మ, ఎంపీటీసీ గిద్దె కరుణాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు క్రిష్ణ, చంద్రయ్య, మల్లేశం, గామస్తులు చంద్రరెడ్డి, బాలయ్య, పరమేశ్, ఇస్తారి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామ దేవతల పండుగలు

మోటకొండూర్: మండల కేంద్రంలో జరుగుతున్న బొడ్రాయి, దుర్గమ్మ పండుగలు ఆదివారం ముగిశాయి. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, హరిశంకర్ తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు, స్నేహితులు

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రానికి చెందిన కొల్లోజు మణెమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. ఆమెతో చదువుకున్న తోటి స్నేహితులు రూ. 1లక్ష, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆత్మకూరు(ఎం) స్నేహితులు రూ. 40వేలు ఆర్థికసాయాన్ని ఆదివారం మణెమ్మ కూతురు బాశ్వికకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లం నర్సయ్య, మల్లేశం, యాదిరెడ్డి, లక్ష్మణ్, శ్రీనాథ్ , చారి, శ్రీను, మలేశ్, రాజు, విజయ్, కృష్ణ, సుధాకర్, వెంకట్, నర్సిరెడ్డి, లలిత, రాజేశ్వరి, శ్వేత, సంగీత, సోమలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బొమ్మలరామారం : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



బీబీనగర్ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

బొమ్మలరామారం : మండలంలోని మర్యాల జెడ్పీ హై స్కూల్ 2010–11 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. చిన్ననాటి మిత్రులను కలసి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహ, గౌస్, జహంగీర్ అలీ, అరుణ, కృష్ణమూర్తి, పూర్వ విద్యార్థులు అనిల్, శ్రవణ్, ఆదిల్, బాలకృష్ణ, విజయ, శ్యాంబాబు, నరేష్, వీరేష్, భిక్షపతి, నరేందర్, కల్యాణి ఉమారాణి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బీబీనగర్: మండలంలోని కొండమడుగు గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 2004–2005 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరేశం, సత్యనారాయణ, సుధాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు మహేందర్, శ్రీనివాస్, అభిలాష్, రవి, భానుప్రకాశ్, పూర్ణిమ, ప్రేమలత, గీత పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు



అడ్డగూడూరు : కోటమర్తిలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి



బీబీనగర్ : పూజలు నిర్వహిస్తున్న నాయకులు

అడ్డగూడూరు : మండలంలోని కోటమర్తి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిప్పలపల్లి బాలు, చెవిటి వెంకన్న, నర్సయ్య అనురాధ, నాగరిగారి ప్రీతం , లింగయ్య యాదవ్ , నరేష్ , పాండు, నాగరాజు, సత్యనారాయణ, రవీందర్ రావు పాల్గొన్నారు.

బీబీనగర్: మండలంలోని జియాపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపనను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ సుధాకర్ గౌడ్, జెడ్పీటీసీ ప్రణీతాపింగళిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు అక్బర్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రవికుమార్, మన్నె బాల్‌రాజు, రాజేశ్వర్, సంజీవరావు, శ్యామ్ పాల్గొన్నారు.

మోడ్రన్ ధోబీ ఘాట్లు నిర్మించాలి

బొమ్మలరామారం : అన్నిరంగాలలో వెనుకబడిన రజక వృత్తిదారులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రతి గ్రామంలో మోడ్రన్ దోబిఘాట్‌లు నిర్మించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు ముదిగొండ శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రజక వృత్తిదారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని చేతి వృత్తుల వారిని ఆదుకుంటున్న ప్రభుత్వం రజకులపై వివక్ష చూపిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ భరత్ కుమార్ , జెల్లా మల్లేష్, నాయకులు ఎడిజర్ల భూపాల్, జూపల్లి లింగం, జూపల్లి జంగయ్య, జూపల్లి శ్రీకాంత్, జూపల్లి వెంకటేష్, చంద్రమౌళి, జెల్లా పాపులు, జూపల్లి పాండు,ఎడిజర్ల బాల్‌రాజ్, నర్సింహ, నగేష్, రాములు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

భూదాన్‌పోచంపల్లి : చేనేత వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని చేనేత కార్మిక చీరల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు రుద్ర శ్రీశైలం అన్నారు. ఆదివారం చేనేత కార్మిక చీరల ఉత్పత్తిదారుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 6 నెలలుగా గిరాకీ లేక చేనేత వస్త్రాలు పేరుకుపోయాయన్నారు. నష్టాలు వస్తున్న చేనేత కార్మికులకు పని కల్పించాలనే మానవతా దృక్పథంతో మగ్గాలను నడిపించామన్నారు. కాని మార్కెటింగ్ లేక, పెరిగిన నూలు ధరలు, జీఎస్టీ, ప్రభుత్వ సహకారం లేక చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 15 రోజులలో స్పందించి చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని, మాస్టర్ వీవర్స్‌కు పావలావడ్డీ కింద రూ.25 లక్షల రుణాలు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో మగ్గాలను బంద్ చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అంకం మురళి, వనం బుచ్చిదాసు, కడవేరు చంద్రశేఖర్, ఆడెపు అంజనేయులు, ఏలే పాండు, సభ్యులు మేకల రామకృష్ణ, రుద్ర చెన్నకేశవులు, బలరాం, రాంచంద్రం, నరహరి, బత్తుల కుమార్, నర్సింహ, గుండు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

వాటర్ క్యాన్ల పంపిణీ



వాటర్ క్యాన్లను పంపిణీ చేస్తున్న నాయకులు

ఆత్మకూరు(ఎం): మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామంలో బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంచినీటి క్యాన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆకుల సరితముత్యంగౌడ్ మాట్లాడుతూ బీర్ల ఫౌండేషన్ అందజేస్తున్న మంచినీటి క్యాన్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మర్యాల వెంకటేశ్వర్లు, బత్తిని ఉప్పలయ్య, సైరెడ్డి మల్లారెడ్డి, చిన్నం బీరప్ప, తీగల అశోక్, ఆకుల భిక్షపతి,చిన్న శ్రీనువాస్ పలువురు నాయకులు, బీర్ల ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఉల్లాసం



చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న సీత భాస్కర్

భూదాన్‌పోచంపల్లి : యోగాతో మానసిక ఉల్లాసం కలుగుతుందని బోధిధర్మ యోగా అండ్ హెల్త్ అసోసియేషన్ అధ్యక్షుడు సీత భాస్కర్, యోగ శిక్షకురాలు కొయ్యడ సంధ్య అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో బోధిధర్మ యోగా అండ్ హెల్త్ అసోసియేషన్, జిల్లా క్రీడా, యువజన సర్వీసుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వేసవి యోగా శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా యోగ శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది చిన్నారులకు జిల్లా క్రీడా, యువజన సర్వీసుల శాఖ ద్వారా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చింతల రామకృష్ణ, సహాయ కార్యదర్శి విష్ణుమూర్తి, కొండమడుగు మల్లేశ్, రత్నం, సైకిలాబ్, రాజు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

భువనగిరిటౌన్ : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన భువనగిరి పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి సయ్యద్ అలీ శనివారం బంధువుల ఇంట్లో జరుగుతున్న వివాహానికి వెళ్లారు. గమనించిన దుండగులు సయ్యద్ ఇంట్లోకి చొరబడి బీరువాలోని ఐదు బంగారు ఉంగరాలతో పాటు రూ.10వేల నగదును అపహరించుకుపోయారని బాధితులు తెలిపారు.

తాళం పగులగొట్టి.. వస్తువులు చిందరవందర చేసి..

భువనగిరి పట్టణంలోని న్యూరాంనగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఆకుల రాణిమూడు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లింది. ఆదివారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బైక్ అపహరణ

భువనగిరి పట్టణంలోని న్యూరాంనగర్ కాలనీకి చెందిన సుబ్బారావు ఈ నెల 2వ తేదీన ఇంటి ఆవరణలో బైక్ నిలిపి లోనికి వెళ్లాడు. భోజనం చేసిన తర్వాత బయటికి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దుండగులు బైక్‌ను అపహరించారని సుబ్బారావు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పర్యవేక్షణ.. పారదర్శకత!

- పెరగనున్న పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయాలు
- భువనగిరిలో సర్కిల్, రామన్నపేట, మోత్కూరులో సబ్ డివిజన్ ఆఫీసులు
- పనుల్లో పెరగనున్న పారదర్శకత
- ప్రజలకు తప్పనున్న దూరభారం



గతంలో ఇంజనీరింగ్ సబ్ డివిజన్ కార్యాలయంగా కొనసాగిన భవనం

రామన్నపేట : పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ పనులపై పర్యవేక్షణ, మానిటరింగ్ ను పెంచడం ద్వారా నాణ్యత, పారదర్శకత కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అదనంగా చీఫ్ ఇంజనీర్, సర్కిల్ కార్యాలయాలు, డివిజన్ ఆఫీసులు, సబ్‌డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నెల 23న ఉత్తర్వులు జారీ చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో సర్కిల్ కార్యాలయం, రామన్నపేట, మోత్కూరులలో సబ్ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు.

రామన్నపేటలో మూడోసారి..

రామన్నపేట అసెంబ్లీ నియోజకవర్గం, పాత తాలుకా కేంద్రంగా ఉండేది. డీలిమిటేషనల్‌లో అసెంబ్లీ నియోజకవర్గం రద్దయింది. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా రామన్నపేటలో 2009 వరకు పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీరింగ్ కార్యాలయం ఉండేది. అప్పట్లో దాని పరిధిలో రామన్నపేటతోపాటు వలిగొండ, మోత్కూరు. ఆత్మకూరు(ఎం), గుండాల మండలాలు ఉండేవి. నియోజకవర్గం రద్దుతో సబ్‌డివిజన్ కార్యాలయాన్ని ఎత్తివేశారు. రామన్నపేటను నకిరేకల్‌లో మిగిలిన మండలాలను, భువనగిరి, తుంగతుర్తి డివిజన్‌లలో విలీనం చేశారు. తెలంగాణరాష్ట్రం ఏర్పడిన తరువాత చిట్యాల–రామన్నపేట మండలాలకు కలిపి తిరిగి సబ్‌డివిజన్‌ను ఏర్పాటు చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో చిట్యాలను నార్కట్‌పల్లిలో, రామన్నపేటను ఆలేరు సబ్ డివిజన్‌లో విలీనం చేశారు. ప్రజాప్రతినిధులు, వీడీసీలు, కాంట్రాక్టర్లు ఎంబీ రికార్డుల కోసం జిల్లా కేంద్రాన్ని దాటి 90కి.మీల దూరంలో ఉన్నటువంటి ఆలేరుకు వెళ్లాల్సి వచ్చేది. నాలుగేళ్ల నరకయాతన అనుభవించారు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చొరవతో ఆలేరు నుంచి విడదీసి చౌటుప్పల్ డివిజన్‌కు అటాచ్ చేశారు. ఎమ్మెల్యే సిఫారసు మేరకు ఇటీవల రామన్నపేటను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. సబ్‌డివిజన్ కార్యాలయం తిరిగి మంజూరు కావడంతో స్థానిక ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నూతన కార్యాలయం ఏర్పాటు ఎక్కడ?

త్వరలో సబ్‌డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. అయితే ఇది వరకు సబ్ డివిజన్ కార్యాలయాన్ని నిర్వహించిన భవనంలో ప్రస్తుతం ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. తిరిగి మంజూరైన సబ్‌డివిజన్ ఆఫీసును ఎక్కడ ఏర్పాటు చేస్తారో వేచిచూడాలి. రామన్నపేట సబ్ డివిజన్‌కు అటాచ్ చేసే మండలాల విషయంలో కూడా ఇంకా స్పష్టత రాలేదు.

ఇబ్బందులు తొలగిపోతాయి



కొత్తగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయాలు ఏర్పాటు చేయడం వల్ల పనులపై పర్యవేక్షణ పెరుగుతుంది. అభివృద్ధి పనుల్లో నాణ్యత పెరుగుతుంది. గ్రామాల్లో పనులు చేయించిన ప్రజాప్రతినిధులు, వీడీసీలు, కాంట్రాక్టర్లకు బిల్లులు చేయించుకునే పని సులువుతుంది. గతంలో ఎంబీ రికార్డ్ చెక్‌మెజర్ కోసం ఆలేరుకు పోవాల్సి వచ్చేది. చౌటుప్పల్ డివిజన్‌కు అటాచ్ చేసిన తరువాత కొంత వెసులుబాటు దొరికింది. రామన్నపేటలో సబ్ డివిజన్‌ను పునఃప్రారంభిస్తే ఇక ఇబ్బందులు తొలగనున్నాయి. సబ్ డివిజన్ ఏర్పాటుకు కృషిచేసిన ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– గుత్తా నర్సింహారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, రామన్నపేట